క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్ పరిశీలన



కంబాలకుంట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ శ్రీధర్ రావు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లు 214, 215, 228, 238లను పరిశీలించి అక్కడి సిబ్బందితో ఆయన చర్చించారు. అలాగే కంబాలకుంట, బెస్తపల్లి పోలింగ్ స్టేషన్లనూ పరిశీలించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు ప్రియనేస్తాలు



మొబైల్ వ్యాన్‌లో ఉన్న పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాజంపేట రూరల్ : పుస్తకాలు ప్రియ నేస్తాలని పట్టణ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆదివారం విశాలాంధ్ర సంచార పుస్తకాలయం (మొబైల్ వ్యాన్)ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన మేధోశక్తి పెంపొందించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మొబైల్ వ్యాన్‌లో ఉన్న పుస్తకాలను ఆయన పరిశీలించారు. అదే విధంగా పాఠకులు పెద్దఎత్తున మొబల్ వ్యాన్‌లోని పుస్తకాలను కొనుగోలు చేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి

రైల్వేకోడూరు : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు షేక్ సలాం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం అనంతరాజుపేటకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. షేక్ సలాం మృతి పార్టీకి తీరని లోటని కొరముట్ల అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, ఓజీ శ్రీనివాసులరెడ్డి, ముక్కా మధుసూదన్‌రెడ్డి, బండారు మల్లి పాల్గొన్నారు.

కాలుష్య గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సమావేశమైన ప్రజా సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాలుష్య గ్రామాలైన కాపుపల్లె, హరిచనవాడ, అరుంధతివాడ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వైఎస్సార్ ఆర్ఆర్-5 ప్రజా సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మంగంపేట కాపుపల్లెలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఆర్-5 పరిహారం, గ్రామాల తరలింపునకు రూ. 300 కోట్లు వచ్చాయన్నారు. ఈ పరిహార నిధులను అందరికీ సమానంగా పరిహారం అందేలా కృషి చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులకు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామసుబ్బారెడ్డి, సతీష్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

రాజంపేట రూరల్ : తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించి అధికారం చేజిక్కించుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్స్ పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు పట్టంకట్టిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సంబరాలలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్, శెట్టిపల్లి సన్నీ, చందు, వెంకటేష్, నారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మిచాంగ్ తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రైల్వేకోడూరు అర్బన్: వరద కారణంగా తెగిన అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన మిచాంగ్ తుపాను పట్ల నియోజకవర్గంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆయన పలు ప్రాంతాలలో పర్యటించి అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. అలాగే రెడ్డివారిపల్లి అప్రోచ్ రోడ్డు, అనంతరాజుపేట తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలపై ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. తుపాను ప్రభావం ఇంకా మూడురోజుల పాటు తీవ్రంగా ఉంటుందని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వం తరఫున ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కావున రైతులు, ప్రజలు ప్రభుత్వ అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని వారు పేర్కొన్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఏర్లు, బావులు, పొలాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే పాఠశాలలకు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వ్యవసాయ సలహామంజలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమనవర్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, సుధాకర్ రాజు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మిచాంగ్ తుపాను కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొర్లకుంట గ్రామంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, తుపాను కారణంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉంటే తప్ప లేకుంటే ఎవరూ బయటకు రావద్దని, వాగులు, వంకలు ప్రవహించే ప్రదేశాలకు వెళ్లరాదన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.



ఓబులవారిపల్లె: ముక్కవారిపల్లి గురుకులంలో వర్షపునీరుతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

గుంజన నదిని పరిశీలించిన ఆర్డీఓ, డీఎస్పీలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ప్రాంతంలో తుపాను ప్రభావంతో రాజంపేట డీఎస్పీ చైతన్య, ఆర్డీఓ రామకృష్ణారెడ్డిలు ఆదివారం గుంజన నదీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. తుఫానుపై ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు పట్ల ఆర్డీఓ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం నదీ పరివాహక ప్రాంతాలలో ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. నదీ పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సోమవారం పాఠశాలలకు సెలవు

పుల్లంపేట : మిచాంగ్ తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుల్లంపేట తహసీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు రాత్రి వేళల్లో పంట పొలాల వద్దకు వెళ్లరాదని, ఏవైనా విపత్తులు సంభవిస్తే 7674950727 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించినట్లు వారు తెలిపారు.

వర్షాలకు విద్యార్థుల అగచాట్లు

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లి గురుకుల పాఠశాలలో మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు భవనంలో వర్షపు నీటితో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులకు వసతి గృహంలో వర్షపునీరు కారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవం



రామాపురం: అక్కదేవత ఆలయంలో పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



గాలివీడు: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న వివిధ ఆలయాల ధర్మకర్తలు

గాలివీడు : గాలివీడు మండలం పేరంపల్లె గ్రామం తాతిరెడ్డిగారిపల్లె వద్ద వీరాంజంజనేయస్వామి, విజయ గణపతి, వాయులింగేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయంలో ధర్మకర్తలు తాటిరెడ్డి వినీతారెడ్డి, వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు నిర్వహించిన అష్టాదశ వార్షికోత్సవ పూజలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవంతుడి దయవల్ల ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌మొహిద్దీన్ (ఎస్.కె.)వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి, కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, బట్టి రమణా వెంకటేష్, కాల్వపల్లె రమణా రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కదేవతకు సతీసమేతంగా ఎమ్మెల్యే పూజలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం యర్రంరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన అక్క దేవత ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. అక్కదేవతల కరుణా కటాక్షాలతో వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లెకు చెందిన షేక్ మహమ్మద్ గౌస్ ఇచ్చిన విందులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ వెంటకరమణ, ఆవుల నాగభూషన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు మునీర్, రామాంజులు, వెంకటసుబ్బారెడి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివ, దర్బార్, ఉప సర్పంచ్ చంద్రయాదవ్, కనపర్తి చెన్నారెడ్డి, దొర, సత్యారెడ్డి, మహబూబ్‌బాషా, సలాం, సుభాన్, ఫయాజ్, రమణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు వీరవిధేయుడు గంగిరెడ్డి నారాయణ యాదవ్ సతీమణి దేవకిదేవి దశదిన ఖర్మకాండలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆధ్యాత్మిక సంపద ముందు అంతా శూన్యమే



పుస్తకాన్ని అందుకుంటున్న డా.మాడగుల ఫణిశర్మ

రాజంపేట : మనిషి ఎంత సంపాదించిన ఆధ్యాత్మిక సంపద ముందు అంతా శూన్యమేనని డా.మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. ఆదివారం సిద్దులయ్యగుట్టపై వెలసిన శ్రీ కామాక్షి సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తి ప్రవచనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం చాలా గొప్పదన్నారు. దీనిని కాపాడుకోవడంలో అందరూ ముందుండాలన్నారు. శివార్చనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్తీకమాసం చాలా విశిష్టత కలిగిందన్నారు. పరమేశ్వరుడి స్వరూపమైన మాసమన్నారు. దీపం పెట్టిన, దానం చేసిన, సత్కార్యం చేసినా అనంతకోటి వరములను ప్రసాదిస్తుందన్నారు. ఈ మాసంలో ఒకరిని దుర్భాషలాడటం, ఒకరిని నిందించడం చేయకుండా వీలైనంత మంచిమాటలు చెప్పడమే జపయజ్ఞం అంటారన్నారు. సిద్దేశర్వుడు అంటే కోరిక వెంటనే తీరుతుందని, కామాక్షి అమ్మవారి చూపుతో కోరిన కోర్కె నెరవేరుస్తుందన్నారు. సిద్దులయ్యగుట్టపై వెలసిన సిద్దేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఆలయాల అభివృద్ధికి అందరూ సమష్టి కృషి చేయాలన్నారు. అంతకముందుగా ఆయన స్వామివార్లను దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాడగుల ఫణిశర్మకు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జానకిరామయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ డా.మాడగుల ఫణిశర్మను మర్యాదపూర్వకంగా కలిసి, కథల పుస్తకాన్ని ఆయన అందజేశారు.

కార్తీక సోమవారానికి ముస్తాబైన శివాలయాలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం పంచాయతీ తూర్పుపల్లి వద్ద ఉన్న బోడ మల్లేశ్వరస్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రజల నమ్మకం. 13వ శతాబ్దంలో మట్లి భూపతిరాజు హయాంలో ఈ బోడ మల్లేశ్వర స్వామి(శివలింగం)ని ప్రతిష్టించినట్లు చరిత్ర చెబుతోంది. పొత్తపినాడు నుంచి భూపతిరాజు నెల్లూరుకు బయలుదేరి వెళ్తుండగా అక్కడికి వచ్చి వేప చెట్టు కింద కాసేపు సేద తీరాడు. స్వప్నంలో ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్టించి ఈ ప్రాంతాన్ని పుణ్యక్షేత్రంగా మార్చాలని స్వామివారు తెలియజేసినట్లు పెద్దలు తెలియజేశారు. స్వప్నంలో చెప్పినట్టుగానే శివలింగాన్ని అక్కడ ప్రతిష్టించి భూపతిరాజు తిరిగి వెళ్లారు. శివలింగం పక్కనే వేపచెట్టు మొక్క మొలవడంతో ప్రజలు గుర్తించి అక్కడ దేవాలయాన్ని నిర్మించారు. శివాలయంతోపాటు సాయిబాబా ఆలయం, కామాక్షి అమ్మవారు ఆలయం, శ్రీకృష్ణ ఆలయం, నవగ్రహాలు ఆలయాలను కూడా నిర్మించారు. మూడో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమం, చెక్కభజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ గుర్రయ్య తెలిపారు.



ఆలయంలో కొలువుతీరిన బోడ మల్లేశ్వరుడు

కోమంతరాజుపురంలో..

కోమంతరాజుపురం నాగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడో కార్తీక సోమవారానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయం వద్ద నారాయణ నెల్లూరు గ్రామ ప్రజలు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సింగనమల శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.

నేడు కులగణనపై సమావేశం

ఓబులవారిపల్లె : మండలంలో కులగణన నిర్వహణపై నేడు సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీఓ విజయారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 1064 మంది హాజరు

మదనపల్లె సిటీ: నేషనల్ మెరిట్ కం మీన్స్ సమూనా పరీక్షకు 1064 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, హోప్, వివేకానంద, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. 1111 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1064 మంది హాజరయ్యారు. 47 మంది పరీక్షకు హాజరుకాలేదు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఇన్సాఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందన్నారు. సెక్యులర్ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ తినే తిండిపైన, కట్టుకునే బట్టపైన ఆంక్షలు విధిస్తూ కామన్ సివిల్ కోడ్ తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మోదీ స్వదేశీ విధానం పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని పెట్టుబడిదారులు ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు.

ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడి ఎన్నిక

కలకడ : కలకడ మండలం ఎనుగొండపాళ్యెం పంచాయతీ ఆవులప్పగారిపల్లెకు చెందిన చిన్నమనాయుడుని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికచేసినట్లు ఆ పార్టీ ఓబీసి జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్‌లు తెలిపారు. ఆదివారం ఈ మేరకు కలకడలో ఆదివారం నియామకపత్రం అందజేశారు.

రెడ్డెమ్మకొండపై ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శభాష్ వలంటీర్

వాల్మీకిపురం: వలంటీర్లు పరిధి దాటి సేవలందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. పట్టణంలోని కొత్తపేటవీధికి చెందిన సరోజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతోంది. ఇదే ప్రాంతానికి చెందిన వలంటీర్ రమణమ్మ బెంగళూరుకు చేరుకొని సరోజమ్మకు పింఛన్ అందజేసింది. దీంతో పలువురు వలంటీర్ రమణమ్మను అభినందించారు.

దివ్యాంగులను అన్ని రకాలుగా ఆదుకోవాలి



పుల్లంపేట: విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులను అన్ని రకాలుగా ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గన్నామంతి బాలాజీ, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు వంగిమళ్ళ రంగారెడ్డిలు కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో డైట్ పాఠశాలలో దివ్యాంగుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ప్రత్యేక కాలనీలు నిర్మించి ఇవ్వాలని, అర్హులకు త్రీ వీలర్ స్కూటర్‌లు మంజూరు చేసి అందజేయాలన్నారు. చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, చదువుకోని వారికి బ్యాంకుల నుంచి స్వయం ఉపాధి కోసం సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.5 వేలుకు పెంచాలన్నారు. దివ్యాంగులంతా మానసికంగా కృంగిపోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నేతలు అన్నెం చిన్నసుబ్బయ్య, గగ్గటూరి మస్తాన్‌వలి, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

మనోస్థైర్యాన్ని కోల్పోరాదు

పుల్లంపేట : విభిన్న ప్రతిభావంతులు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా జీవించాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం సభ్యుల సమక్షంలో సుబ్బనరసారెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులలో ఆత్మ విశ్వాసం నింపే విధంగా వారికి స్వయం శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. ప్రస్తుత జీవన విధానంలో నివసించడానికి అనుగుణంగా ప్రభుత్వం పింఛన్‌ను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, జనరల్ సెక్రటరీ అబ్దుల్ మజీద్, వలంటీర్ మురళీ, ఆంజద్, మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడదాం



మాట్లాడుతున్న మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్

రాయచోటి అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం దళిత ఉద్యోగులందరూ సమష్టిగా పోరాడదామంటూ మేడ్ (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయీస్) రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్ జిల్లా కార్యవర్గం సమావేశం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ఐక్యత, అభివృద్ధి, ఆత్మగౌరవం నినాదాలతో మేడ్ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలోని దళిత ఉద్యోగులందరూ మేడ్‌లో సభ్యులుగా చేరి సంఘాన్ని బలపరచాలన్నారు. అన్నమయ్య జిల్లా మేడ్ అధ్యక్షుడిగా అబ్బవరం హరిబాబును నియమించినట్లు తెలిపారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్ కడప జిల్లా అధ్యక్షుడు ఎస్.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి చల్లపు రాజారావు, ఉపాధ్యక్షుడు ఎం.రవిప్రకాష్, జిల్లా నేతలు ఆర్.వెంకటరమణ, పూసపాటి రెడ్డెయ్య, బి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల పూజలందుకున్న అమ్మవార్లు



సంబేపల్లె: గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ దేవతకు ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కుంకుమార్చనలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన నల్లగంగమ్మకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : ఇరుగులమ్మకు ఆదివారం పూజలు నిర్వహించినట్టు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, అర్చనలు జరిపామని తెలియజేశారు. మరికొందరు భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని పూజారి తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు

రాజంపేట రూరల్ : డిసెంబర్ 8 నుంచి అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి ఈ సికిందర్‌లు తెలియజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి రావాల్సిన ప్రతిది అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణం కార్మిక సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటయ్య, పి.సుబ్రమణ్యం, ఆటో వర్కర్ అధ్యక్షులు, కార్యదర్శి నాగేశ్వర రావు, వెంకటేష్, చంద్ర, బాబాజాన్, అస్లాం బాషా, శివ, రెడ్డమ్మ, హరిత కుమారి, సూరి పాల్గొన్నారు.

శబరిమల మున్‌మేల్ శాంతులతో హోమాలు



హోమం నిర్వహిస్తున్న మేల్ శాంతులు

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ అన్నమాచార్య అకాడమీ పాఠశాలలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు ఆధ్వర్యంలో శబరిమల మున్‌మేల్ శాంతులచే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు హోమాలు, పూజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కేరళలోని శబరిమల, మాలికాపురం మున్‌మేల్ శాంతులతో గణపతి హోమం, సరస్వతీ హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. హోమంలో మండలంలోని భక్తులు, అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మడపూరి హేమలత, సమ్మెట ఉమామహేశ్వర్ రావు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోండి

కలకడ : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ వరప్రసాద్ కోరారు. ఆదివారం కలకడ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఇంటి గోడలకు ఏర్పాటు చేసిన ఐరన్ విద్యుత్ బోర్డు వలన వర్షానికి షాక్ తగిలే అవకాశం ఉందని గుర్తుచేశారు. స్టాటర్లు, మోటార్లు, స్విచ్ బోర్డులను నేరుగా స్విచ్ ఆన్ చేయడం, ఆఫ్ చేయడం చేయరాదని గుర్తుచేశారు. చెప్పులు వేసుకొని ఆరిన బట్టతో స్విచ్ ఆఫ్, ఆన్ చేయడం మంచిదన్నారు. విద్యుత్ సిబ్బంది లేకుండా మరమ్మతులు చేయరాదని సూచించారు. 11 కేవీ మెయిన్‌లైన్ దగ్గరకు వెళ్లరాదన్నారు. ట్రాన్స్‌ఫారాలు మరమ్మతుకు గురైనా, ఫీజులు పోయినా తెలుసుకు కదా అని తడి ప్రదేశాలలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. మరో మూడు రోజుల పాటు అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ సంస్థ తెలియజేయడంతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.